నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం సెప్టెంబర్ 22, 2024 www.navatelangana.com

హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం



నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ శనివారం నిజామాబాద్ పర్యటనకు హాజరైన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జిల్లా కోర్టు భవన సముదాయంలో న్యాయాధికారులతో హైకోర్టు జడ్జి జస్టిస్ కె.సురేందర్ భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. ముందుగా ఆయన స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకోగా, జిల్లా జడ్జి కె.సునీత, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయ శాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అంతకుముందు హైకోర్టు న్యాయమూర్తి పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.

ప్రేమజంట ఆత్మహత్య

- పెండ్లికి ఇరు కుటుంబాలు ఒప్పుకోలేదని బలవన్మరణం





నవతెలంగాణ-దోమకొండ

ఇద్దరు ప్రేమించుకున్నారు. కానీ వారి పెండ్లిని ఇరు కుటుంబీకులు నిరాకరించారు. దీంతో తీవ్ర కలత చెందిన యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తాను ప్రేమించిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న యువతి సైతం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబరిపేట్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. అంబరిపేట గ్రామానికి చెందిన రంగోలి వినా (22), కోనాపూర్ గ్రామానికి చెందిన మొగిలి సాయి కుమార్ (24) చదువుకునే సమయంలో ఇద్దరికి స్నేహం పెరిగి స్నేహం కాస్త ప్రేమగా మారింది.

కనిపిస్తే కాటే..

- తీవ్రమవుతున్న వీధి కుక్కల బెడద
- కుక్కలు కనిపిస్తే జంకుతున్న ప్రజలు
- వాటి నియంత్రణా చర్యలు శూన్యం
- టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేసినా కనిపించని స్పందన





పెద్దకొడప్‌గల్‌లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

నవతెలంగాణ-కంఠేశ్వర్/పెద్దకొడప్‌గల్

నగరం, పట్టణం అన్న తేడా లేకుండా కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రతరమవుతుంది. గుంపులు గుంపులుగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కనిపించిన వారి వెంట పడుతూ హడలెత్తిస్తూ దాడి చేస్తున్నాయి. పలు వీధుల్లో ఇటీవల వీధి కుక్కలు బెడద శృతిమించి పోతోంది. వీధులు రహదారులపై గుంపులు గుంపులుగా తిష్ట వేస్తున్నాయి. విధుల గుండా నడుచుకుంటూ పోయే వ్యక్తులకు, వాహనదారుల వెంటపడి భయపడుతున్నాయి. నిత్యం ఏదో ఒకచోట బాధితులు కుక్కల భారిన పడి ఆస్పత్రులకు వెళ్తున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో ఇంట్లో నుండి కాలు బయటపెట్టాలంటే జంకుతున్నారు. విధుల్లో స్వైర విహారం చేస్తున్న శునకాలు జనాలపై పడి పీక్కుతింటున్నాయి. ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస కుక్క కాటులు ప్రజలను కలవరపెడుతున్నాయి.

గ్రామంలో ఒక వృద్ధురాలు పై పిచ్చి కుక్క ఎగబడి దాడి చేసింది. ఈ దృశ్యాలు సీసీ టివిలో రికార్డు అయ్యాయి. జిల్లాలో విష జ్వరాలను మించిన స్థాయిలో కుక్క కాటు కేసులు రోజురోజుకు ఎక్కువగా నమోదవుతున్నాయి. వాడవాడలో ఎక్కడ చూసినా



నిజామాబాద్ నగరంలో సంచరిస్తున్న కుక్కలు

కుక్కల స్వైర్యవిహారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. అధికారుల లెక్కలకు అంతుచిక్కని విధంగా వేల సంఖ్యలో కుక్క కాటు కేసులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. వీధులలో నడవాలంటేనే కుక్కల సంచారం భయనక పరిస్థితిని తలపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో పట్టణాలలోని వీధి కుక్కల హల్ చల్ ఎక్కువగా ఉంది. వీధి కుక్కలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సైతం సీరియస్ గా పరిగణించింది. తక్షణమే వీధి కుక్కలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలతో గ్రామ పంచాయతీలు, మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఇందుకోసం నిజామాబాద్ నగరంలోని మున్సిపాలిటీలో టోల్ ఫ్రీ నెంబర్‌ని ఏర్పాటు చేశారు. కానీ టోల్ ఫ్రీ నెంబర్ కు అధికంగా ఫిర్యాదులు రావడంతో అధికారులు అంతగా స్పందించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో వీధులలో కుక్కల హడావుడి ఎక్కువవుతుంది.

నిజామాబాద్ జిల్లాలో గత ఏడాది జిల్లా జనరల్ ఆస్పత్రిలో 1600 కుక్క కాటు కేసులు నమోదు కాగా, ఏడాది ఇప్పటివరకు ఎనిమిది వందల కేసులు నమోదైనట్లు అధికారిక గణంకాలు వెల్లడించాయి. కానీ వేల సంఖ్యలో కేసులు నమోదు అవుతున్న అధికారుల రికార్డుల్లోకి రాకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రులలో వేల సంఖ్యలో కుక్క కాటు కేసులకు చికిత్సలు అందిస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రితో కుమ్మక్కు.. కృత్రిమ కొరత?

కుక్క కాటుకు సంబంధించిన యాంటీ రెబిస్ వ్యాక్సిన్(ఆర్బివి) ప్రభుత్వ ప్రవేట్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా ఈ వ్యాక్సిన్ వేస్తుండగా ప్రైవేట్ ఆస్పత్రులలో మాత్రం 2వేల నుండి 5వేల వరకు వసూలు చేసి వ్యాక్సిన్ వేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులతో కుమ్మక్కైన కొందరు ప్రభుత్వ వైద్యులు రెబిస్ వ్యాక్సిన్ కొరత సృష్టించి ప్రైవేట్ ఆస్పత్రులకు అండగా నిలుస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది.

టోల్ ఫ్రీ నెంబర్లు ఫిర్యాదు చేసిన స్పందించకపోవడంపై అధికారుల తీరును ప్రజలు ఎండగడుతున్నారు. ప్రతి వీధిలో 20 నుంచి 50 వరకు వీధి కుక్కలు సంచరించి ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లాలంటేనే ప్రాణాలు అరచేతి లో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.. చిన్నారులైతే లెక్కలేని సార్లు కుక్కకాటుకు బలి అవుతున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల బలిఅవుతున్నారు. రాత్రి అయిందంటే చాలు భయంతో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎవరింటికి వారు వెళ్లాలంటే కుక్కల భయంతో సగం చచ్చిపోతున్నారు. ఒంటరిగా కనబడితే చాలు మూకుమ్మడిగా దాడులు చేస్తున్నాయి. ఇలా చాల చోట్ల సంఘటనలు జరుగుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నిరెత్తినట్లు చూస్తున్నారు. ఎవ్వరు పట్టించుకోకపోవడంతో చిన్న పిల్లలపై కక్కుల దాడులు జరుగుతునే ఉన్నాయి. ఇది ఇలా ఉండగా కుక్కలను నియంత్రించేందుకు లక్షల రూపాయల్లో ఖర్చు చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చెప్తున్నారు.

కుక్కలను నియంత్రించాలంటే తప్పనిసరిగా ప్రత్యేక బృందాలతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తుంటారు. దీనిని సాకుగా చేసుకొని డబ్బులు ఖర్చు చేయకున్నా చేసినట్లుగా నిధులను దుర్వినియోగం చేస్తున్నట్లు నిజామాబాద్ మున్సిపాలిటిపై గతంలో అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై అప్పటి ప్రభుత్వం ఉన్న అధికారులు స్పందించకపోవడంతో మున్సిపల్ బడ్జెట్లో 20 లక్షల పైన ఖర్చు చేసినట్లు వెల్లడించారు. కుక్కల కోసం లక్షల్లో డబ్బులు ఖర్చు చేసిన వీధిలో మాత్రం కుక్కల సంచారం అధికంగా ఉంది. దీనిని బట్టి కుక్కల కోసం ఖర్చు చేయకుండానే నిధులు స్వాహా చేసినట్లు సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో అనధికారిక గణాంకాల ప్రకారం 2023లో 4,418 మందికి, 2024 ఇప్పటివరకు 2050 మంది కుక్కకాటుకు గురయ్యారు.

అసైన్డ్ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

- సీపీఐ (ఎం) డిమాండ్.. సబ్ కలెక్టర్‌కు వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-జుక్కల్(మద్నూర్)

అసైన్డ్ పోడు భూమి రైతులకు భూ పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సబ్ కలెక్టర్ జుక్కల్‌ను సందర్శించగా.. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. జుక్కల్ మండలంలోని, బస్వాపూర్, కండెబాల్లూరు, కౌలాస్, కేమ్రాజ్ కల్లాలి, వజ్రకండి, మైలార్, సవర్గం తాండ, బంగారు పల్లి, మైబాపూర్, గుండూర్, కంటాలి, తదితర గ్రామాలలో పలు రైతు కుటుంబాలు సుమారు 40 నుంచి 50 ఏండ్లుగా సాగు చేసుకుంటున్నారని, ఆయా రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. వారికి ఈ భూమి తప్ప వేరే భూమి లేదని, ధరణి సమస్యలు పరిష్కరించి అసైన్డ్ పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లేందుకు తప్పకుండా కృషి చేస్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

సైన్స్ పరిజ్ఞానం పెంచాలి

- గురుకుల విద్యార్థులతో కలిసి రాత్రి బస చేసిన జిల్లా కలెక్టర్
- నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని ఆదేశం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి





పిల్లలతో కలిసి భోజనం చేసి, వారితో కలిసి నిద్రించిన కలెక్టర్

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల వసతి గృహంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం నాడు రాత్రి వసతి గృహంలో బస చేసి విద్యార్థులతో నిద్రించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులలో సైన్స్ పరిజ్ఞానాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే దిశగా ప్రోత్సాహం అందించాలని,లక్ష రూపాయల విలువ చేసే సైన్సు సామాగ్రిని కొనుగోలు చేయాలని గురుకుల సిబ్బందికి సూచించారు. అనంతరం అందరితో కలిసి హాస్టల్లోనే నిద్రించారు. ఉదయం నిద్ర లేచి హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి, విద్యార్థులకు పౌష్టికాహారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం మైనార్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మొక్కలకు నీరు పోశారు. ప్రభుత్వం పేద విద్యార్థుల చదువుల కోసం కృషి చేస్తుందని, అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ అవసరమైన ఏర్పాట్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ ఓ రాజు, జిల్లా సైన్సు అభివృద్ధి అధికారి సిద్ధిరాంరెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి దయానంద్, ఎల్లారెడ్డి ఆర్డిఓ ప్రభాకర్, తహసిల్దార్ మహేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ కోసం స్థలం కేటాయించిన గ్రామస్తులు



పట్టా అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలం లోని కాచాపూర్ గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు అయింది. సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థలం లేకపోవడంతో గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, రైతులు అందరూ కలిసి గ్రామ సమీపంలో ఉన్న శివ సాగర్ బీడీ కంపెనీ వద్ద రెండు గుంటల భూమిని కొనుగోలు చేసి విద్యుత్ శాఖ అధికారులకు అందజేశారు. గ్రామ ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని అడిగిన వెంటనే స్థలాన్ని ఇచ్చిన శివసాగర్ బీడీ కంపెనీ యాజమాన్యానికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏడిఈ కిరణ్ చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గాల్ రెడ్డి, సుదర్శన్, మాజీ ఉపసర్పంచ్ సిద్దా గౌడ్, గ్రామస్తులు, రైతులు, తదితరులు ఉన్నారు.

వ్యవసాయ పనిముట్ల దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ నరేశ్

నవతెలంగాణ-రామారెడ్డి

వ్యవసాయ పనిముట్లు దొంగతనం చేస్తున్న ఇద్దరు దొంగలను పట్టుకొని పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన అడ్లూరి సత్తయ్య వ్యవసాయ బావి వద్ద నుండి గత మంగళవారం దొంగతనం జరగగా, గ్రామస్తుల సహకారంతో అదే గ్రామానికి చెందిన పల్లెపు రాజు, సుద్దాల సంతోష్ లను రెండు వేరు వేరు కేసుల్లో అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. వారి వద్ద నుండి క్రిమిసంహారక మందు పిచికారి మిషిన్, దీనికి సంబంధించిన 50 మీటర్ల పిచికారి పైపు, సోలార్ చార్జింగ్ బ్యాటరీ, 6 ఎల్బో లు, 2కప్లింగ్ లు, ట్రాక్టర్ బ్యాటరీ లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది దేవా గౌడ్, రమేష్, పవన్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌లో పాము కలకలం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలం లోని తెలంగాణ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ కళాశాల ల్యాబ్‌లో శనివారం పాము కలకలం రేపింది. ఒక్కసారిగా ల్యాబ్ లో పాము కనబడడంతో అక్కడున్న సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న పలువురు సిబ్బంది కాసేపటికే పామును చాకచక్యంగా బయటకి పంపించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రైతు నాయకుడికే పట్టం

- నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి



ముప్ప గంగారెడ్డి



ఆయనకు స్వాగతం పలుకుతున్న మోపాల్ మండల నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/మోపాల్

నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రైతు నాయకుడికి అవకాశం దక్కింది. తన రాజకీయం జీవితమంతా కాంగ్రెస్‌తోనే ఉన్నాడు. రైతు నాయకుడు ముప్ప గంగారెడ్డి నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ సహకార శాఖ కార్యదర్శి రఘునందన్ రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్‌గా జంగిటి రాంచందర్‌తో పాటు 11 మంది డైరెక్టర్లను నియమించారు. రాజకీయ జీవితం ప్రారంభం నుంచి కాంగ్రెస్ లోను కొనసాగుతున్న ముప్ప గంగారెడ్డికి తగిన గుర్తింపు లభించిందని పార్టీ శ్రేణులు హర్షిస్తున్నాయి.

సొసైటీ డైరెక్టర్ నుంచి ముప్ప పయనం

ముప్ప గంగారెడ్డి 1987లో బాడ్సి సొసైటీ డైరెక్టర్ గా పని చేశారు. 1988లో ముదక్ పల్లి-నర్సింగ్ పల్లి సర్పంచ్ గా, 1995లో ముదక్ పల్లి - నర్సింగ్ పల్లి ఎంపీటీసీగా విజయం సాధించి వైస్ ఎంపీపీగా పని చేశారు. 2005-14 వరకు సింగిల్ విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గా ఉన్నారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పని చేసిన ఆయన 2015 నుంచి కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

కాగా ముప్ప గంగారెడ్డికి చైర్మన్ పదవి వరించడంతో కుటుంబీకులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

పాలకవర్గం సభ్యులు..

ముప్ప గంగారెడ్డి (చైర్మన్), జంగిటి రాంచందర్(వైస్ చైర్మన్), డైరెక్టర్లుగా ఐల రాజలింగం, యెన్నం బాగారెడ్డి, దండ్ల రాజన్న, మెదావత్ మంగిత్యా, జి గంగారెడ్డి, వంగల దేవకరుణ, పెంట ఇంద్రుడు, సైనేని వెంకటేశ్వరరావు, కౌడపు రఘువీర్, మహ్మద్ ఎసా, జోగిని మల్లేశ్, అతిగటి నరేందర్ నియమితులయ్యారు. వీరితోపాటు ఇద్దరు ట్రేడర్లు, నలుగురు ఎక్స్ అఫీషియో మెంబర్లను కార్యవర్గంలో నియమించారు.

కష్టపడ్డ వారికి గుర్తింపు : ముప్పగంగారెడ్డి

మోపాల్ : నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి నియమించబడిన తర్వాత మొదటిసారి జిల్లాకు రావడంతో మోపాల్ మండల కాంగ్రెస్ నాయకులు మాధవనగర్ సాయిబాబా ఆలయంలో ఘన స్వాగతం పలికారు. ఆయన తొలిసారి పదవి వరించిన తర్వాత జిల్లాకు రావడంతో సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పగంగారెడ్డి మాట్లాడుతూ తనకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రావడం రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి గారి కృషి వల్లనే అని, ఆయనకు నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, అలాగే పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ గారికి బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తన మండల కాంగ్రెస్ నాయకులకు, రూరల్ నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తాను ఈ స్థాయికి రావడానికి కారణమైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి నాయకుడికి గుర్తింపు ఉంటుందని ఇందుకు ఉదాహరణ తానే అని అన్నారు. అందుకే కచ్చితంగా ప్రతి కాంగ్రెస్ సైనికుడు పార్టీ కోసం కష్టపడాలని రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూడా పార్టీ అభ్యర్థులు విజయంక మోగించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మోపాల్ మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, సందీప్ రెడ్డి, సతీష్ రావు, ఒడ్డే రాములు, మాజీ జెడ్పిటిసి మోహన్ నాయక్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

నగరంలో స్వచ్ఛతాహిసేవ



జెండాఊపి ప్రారంభిస్తున్న మేయర్, కమిషనర్



తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామా బాద్ నగరంలో కార్పోరేషన్ పరిధిలో పలు డివిజన్‌లో స్వచ్ఛతాహి సేవపై శనివారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. 7వ డివిజన్‌లోని నలంద స్కూల్‌లో ముందుగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు దరి చేరవని తెలిపారు. అదే విధంగా డివిజన్‌లోని కాలనీల్లోని ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేయడంపై వివరించారు. రోడ్డుపక్కన మొలిచిన పిచ్చిగడిని తొలగింపజేసి, డ్రయినేజీలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ సుక్క మధు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సునిల్, జవాన్ శంకర్, వార్డు ఆఫీసర్ లక్ష్మి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అదే విధంగా 20వ డివిజన్‌లో రోడ్లను శుభ్రపరచడం, తడి పొడి చెత్తను వేరు చేసి గురించి అవగాహన కల్పించారు. నాగారం ప్రాంతంలో గల డంపింగ్ యార్డ్‌లో సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో చెత్తను ఎక్కడికక్కడ శుభ్రం చేస్తూ తడి చెత్త పొడి చెత్తగా విడదీసే విధంగా విడదీసి వేరు చేసే పద్ధతిని క్లుప్తంగా వివరించారు.

ఎప్పటికప్పుడు స్కూల్ బస్సులు తనిఖీ చేయాలి

- జిల్లా రవాణా శాఖ అధికారి కే. శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో గల ప్రైవేట్ పాఠశాలల బస్సులను శనివారం తనిఖీలు నిర్వహించామని జిల్లా రవాణా శాఖ అధికారి కే.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు శనివారం పాఠశాల బస్సు యాజమాన్యాలకు, పాఠశాలల ప్రిన్సిపాల్ లకు స్కూల్ బస్సుల మెయింటెనెన్స్‌పై అవగాహన సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంవిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల బస్సులను తరచూ తనిఖీ చేసుకొని ఎప్పటికప్పుడు తగిన మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో స్కూల్ యాజమాన్యం, పాఠశాలల ప్రిన్సిపల్స్, మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్టీసీ మెకానిక్స్, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఓవర్సీస్ స్కాలర్షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

నేషనల్ ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకం కింద 2024-25 సంవత్సరానికి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించుకున్నాలనుకునే పేద షెడ్యూల్డ్ కులాల, సంచార, సెమి సంచార తెగలు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, సంప్రదాయ కళాకారులతో సహా అట్టడుగు వర్గాలకు చెందిన తక్కువ ఆదాయం ఉన విద్యార్థులను ప్రోత్సహిస్తూ మాస్టర్ డిగ్రీ లేదా పీహెచ్డీ వంటి ఉన్నత విద్యను విదేశాలలో అభ్యసించడానికి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సాయం అందిస్తుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి జి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి ఆన్లైన్ http://nosmsje.gov.in ద్వారా నిర్ణీత ప్రొఫార్మాలో తేదీ ఒకటి, తొమ్మిది, 2024 నుండి 45 రోజుల వరకు, రెండవ విడత ఎంపిక కొరకు దరఖాస్తు చేసుకొనుటకై అవకాశం కల్పించబడుతుంది అన్నరు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ తండా వద్ద జాతీయ రహదారి 44పై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు జక్రాన్‌పల్లి ఎస్ఐ తిరుపతి శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. భీంగల్ మండలం సుదర్శన్‌నగర్ తండాకు చెందిన భూక్య సీతారాం (60) శనివారం ఉదయం 6 గంటలకు మదనపల్లి తండా లోని తన కూతురి ఇంటి నుండి బైకుపై తన సొంత గ్రామానికి వస్తుండగా పడకల తండా వద్ద ఎన్‌హెచ్ 44పై ఉన్న యూటర్న్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కొడుకు సురేష్ ఇచ్చిన దరఖాస్తుపై కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
ఆదివారం | సెప్టెంబర్ 22, 2024 | www.navatelangana.com

కలెక్టర్ ఆదేశాల మేరకు పిచ్చి మొక్కల తొలగింపు


పిచ్చి మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి చుట్టుపక్కల ఉన్న ముండ్లపొదలను ఎంపిఓ రాజ్‌కాంత్‌రావు, తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరునగిరి శ్రీధర్‌లో ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రి చుట్టుపక్కల ఉన్న చెత్తచెదారాం, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిఓ రాజ్‌కాంత్‌రావు, పంచాయతీ కార్యదర్శి తిరునగిరి శ్రీధర్, పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు.

కిసాన్‌నగర్‌లో రథం అందజేత


స్వర్గరథం అంజేసిన నర్సింగ్ దాస్, దేవేందర్ శర్మ

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామనికి చెందిన నర్సింగ్ దాస్ శర్మ దేవేందర్ శర్మ స్మారకార్థం స్వర్గరథాన్ని శర్మ కుటుంబ సభ్యులు శనివారం గ్రామపంచాయతీకి అందజేశారు. పెద్దల స్మారకార్థం స్వర్గరథం వితరణ చేయడం అభినందనీయమని గ్రామస్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజలింగం, నాగరాజు, శ్రీనివాస్ గౌడ్, కొంద్రా నవీన్, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రేణుకాదేవి, కారోబార్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ఆవరణలో తనిఖీలు


తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గల రైల్వే స్టేషన్లో సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ చందన దీప్తి ఆదేశాలతో, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాలతో నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ లయక్ అలీ, రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం తనిఖీలను నిర్వహించారు. అలాగే డాగ్ స్క్వాడ్ ఇంచార్జ్ మోహన్ మత్తు పదార్థాల గురించి ప్లాట్‌ఫారం నెంబర్ వన్, పార్సల్ ఆఫీస్ చెక్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే పోలీస్ స్టేషన్లో అక్రమంగా మత్తుపదార్థాలను తరలిస్తున్నారని సమాచారంతో ఈ తనిఖీలను నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్ పోలీసులతోపాటు రైల్వే పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు కాలనీలను సందర్శించిన పంచాయతీరాజ్ ఏఈ


మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఏఈ షరీఫ్

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని పలు కాలనీలను పంచాయతీరాజ్ ఏఈ షరీఫ్ శనివారం సందర్శించారు. నూతన సిసి రోడ్లు, సిసి డ్రైనేజీ నిర్మాణాలకు సంబంధించి నెహ్రూనగర్, అంబేద్కర్ నగర్ కాలనీలను సందర్శించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుందారపు శ్రీనివాస్, యునుస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వే సకాలంలో పూర్తి చేయాలి

- నిజామాబాద్ ఆర్డిఓ రాజేందర్


మాట్లాడుతున్న నిజామాబాద్ ఆర్డిఓ రాజేందర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఓటర్ లిస్టు సర్వే హౌస్ టు హౌస్ సకాలంలో పూర్తి చేయాలని నిజామాబాద్ ఆర్డిఓ రాజేందర్ శనివారం అన్నారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఓటర్ జాబితాపై ఏ విధంగా నిర్వహించాలో, చనిపోయిన వారిని ఓటర్ జాబితాలో నుంచి తొలగించాలని కొత్తవారిని ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, డిప్యూటీ తహసీల్దార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సిబ్బంది, అన్ని గ్రామాల నుంచి వచ్చిన బిఎల్ఓలు పాల్గొన్నారు.

బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ చైర్‌పర్సన్ అయ్యప్ప శ్రీనివాస్ లావణ్య మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశానుసారం స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కమల నెహ్రూ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తడిచెత్త, పొడి చెత్త వేరు చేయడంపై శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించడంతోపాటు మానవహారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణ మౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మద్యానికి బానిసై యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకునాడు. ఈ ఘటన డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్ఓ మహమ్మద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన రాధాకృష్ణ (32) మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌హెచ్ఓ తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు.

ధాన్యం సేకరణ సజావుగా చేపట్టాలి

- అధికారులకు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ దిశానిర్దేశం
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సన్నాహక సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలోని తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ శనివారం సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల అక్టోబర్ నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తేనున్న నేపథ్యంలో, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఈసారి ఖరీఫ్ సీజన్‌లో సుమారు 4.10 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారని, 11.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి చేతికందుతుందని అంచనా వేశామన్నారు. ఇందులో సన్న రకం ధాన్యం అత్యధికంగా 85 శాతం ఉందన్నారు. రైతులు తమ సొంత అవసరాల కోసం, ఇతర ప్రైవేట్ వ్యాపారులకు విక్రయాలు జరిపే ధాన్యాన్ని మినహాయిస్తే, ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని తరలించే అవకాశం ఉన్నట్టు భావిస్తున్నామని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో 480 పైచిలుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల ధాన్యం దిగుబడులు చేతికందే సమయానికి కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయిలో మద్దతు ధర పొందేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2320, సాధారణ రకానికి రూ. 2300 ధర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలోనూ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సరిపడా సంఖ్యలో తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచాలని, రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధాన్యం సేకరణ ముగిసేంత వరకు పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ధాన్యం రవాణాకు సరిపడా సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటదివెంట జరిగేలా అవసరమైన సంఖ్యలో హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలని అన్నారు. ధాన్యం సేకరణలో ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూరుస్తామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట రైస్ మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఏ చిన్న ఇబ్బందికి సైతం తావులేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీ.ఎం రమేష్, డీసీఓ శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగూబాయి, డీపీఎం సాయిలు తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కమ్మర్‌పల్లి ఏఎస్ఐ నరేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హాసకొత్తూర్ చౌరస్తా వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ ప్రజలకు డ్రగ్స్ నిర్మూలన, డ్రంక్ అండ్ డ్రైవ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ నరేందర్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో రోజురోజుకు సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయన్నారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలు అంటూ మోసపూరిత ప్రచారాలతో ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని తెలిపారు. ఇటువంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈజీ మనీ ఆశలో పడి మోసపోవద్దని సూచించారు. కొన్ని గంటల్లో, ఒక్క రోజులోనే, వారం రోజుల్లోనే రెట్టింపు నగదు ఇస్తామంటూ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ ఎరవేస్తూ సైబర్ మోసగాళ్లు కుచ్చుటోపి పెడుతున్నారని తెలిపారు. అలాంటి సైబర్ మోసగాళ్ల విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేస్తూ ఆకట్టుకునే ప్రకటనలతో నమ్మిస్తూ మోసం చేస్తున్నారన్నారు. ప్రొడక్ట్‌తో పాటు ఎడ్యుకేషన్‌కు సంబంధించిన మల్టీ లెవెల్ మార్కెటింగ్ సెమినార్లు పెట్టి లక్షలాది మందిని బురడీ కొట్టిస్తున్నారన్నారు. ప్రజలు అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని సూచించారు. యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దని, డ్రగ్స్ వాడకం ద్వారా ఆ వ్యక్తి జీవితంపైనే కాకుండా కుటుంబంపైన కూడా డ్రగ్స్ ప్రభావం ఉంటుందన్నారు. డ్రగ్స్ సేవించినా, అమ్మినా, సరఫరా చేసినా నేరమని అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. తాగి వాహనాలు నడపద్దన్నారు. తాగి వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలకు గురై విలువైన ప్రాణాలను కోల్పోవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఎస్ఐ నరేందర్

30న ధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈ నెల 30న ఇందిరాపార్క్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చ మోహన్ అన్నారు. శనివారం ఐఎఫ్‌టియు నగర కమిటీ ద్వారకనగర్ ఆఫీస్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటుక బట్టీలో పనిచేస్తున్న వలస కార్మికులకు సంక్షేమ బోర్డులో చేర్చుకొని సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. వేలిముద్ర విధానాన్ని తీసివేసి పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 2009కి నుండి వెల్ఫేర్ బోర్డు ద్వారా 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుండేదని తెలిపారు. గతంలో కెసిఆర్ 500 కోట్లు సంక్షేమ బోర్డు కార్మికుల నిధులు వాడుకుంటే ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎల్ఐసిలకు ప్రైవేట్ సెక్టార్లకు తరలిస్తుందని వారు అన్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని ఇన్సూరెన్స్‌లు కట్టిన డబ్బులతోటి కార్మికుల సొమ్ము ఈ ప్రభుత్వాలు దుర్వినియోగం చేసుకుంటున్నారని కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకున్న ఈ నిధులు కార్మికులకు ఇవ్వకుండా తరలించడం మంచిది కాదని వారన్నారు. కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే కార్మికులకు కార్మిక కుటుంబాలకే ఖర్చు చేయాలని వారు అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రమేష్, అరుణ్, అశోక్, శ్రీనివాస్, ఎస్‌కే వాబ్, అక్బర్‌ఖాన్, అక్రం ఖాన్, ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాత పెన్షన్ సాధనకై ఎంఎల్‌సి బరిలోకి

- రాష్ట్ర సిపిఎస్ నాయకులు కృష్ణారావు


మాట్లాడుతున్న రాష్ట్ర సిపిఎస్ నాయకులు కృష్ణారావు

నవతెలంగాణ-ఆర్మూర్

కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ వచ్చే సంవత్సరం మార్చిలో జరగబోయే ఆదిలాబాద్-మెదక్-నిజామాబాద్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల బరిలో తాను నిలువబోతున్నట్టు తెలంగాణ రాష్ట్ర సి.పి.ఎస్. నాయకులు కృష్ణారావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు గురించి అవగాహన కల్పించారు. రాష్ట్రంలో రెండు లక్షల సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల భవిష్యత్తును అభద్రతలోకి నెట్టిన ఈ సి.పి.ఎస్. విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన ప్రభుత్వానికి కోరారు. ఇది జీవన్మరణ సమస్యగా మారిందని అన్నారు. పాత పెన్షన్‌తోనే తమకు ఆర్థిక, సామాజిక భద్రత ఉంటుందని స్పష్టం చేశారు. పాత పెన్షన్ విధానం లేకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు అభద్రతాభావంలో ఉన్నారని, పదవీ విరమణ అనంతరం జీవితం గురించి తలుచుకుంటేనే భయం వేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాల తరబడి జమ చేసుకున్న సొమ్మును కూడా తమ అవసరాల నిమిత్తం పొందే వీలులేకుండా ఈ సి.పి.ఎస్. విధానం చేసిందని అన్నారు. కావున సి.పి.ఎస్. ఉద్యోగులందరికీ మేలు జరగాలంటే తక్షణమే పాత పెన్షన్ విధానం రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, ప్రిన్సిపాల్‌లు, గురుకుల అధ్యాపకులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ముప్పా గంగారెడ్డికి అభినందనలు



నవతెలంగాణ-ముప్కాల్

నిజామాబాద్ జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ముప్పా గంగారెడ్డి పేరు ఖరారు కావడంతో శనివారం ముప్కాల్ కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్ రెడ్డి ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాగర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఎన్నో రోజుల నుంచి సేవలందించడంతో ఈ పదవి దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పాటుపడుతున్న ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందని అన్నారు.

'శ్రీకారం విశిష్ట సేవా పురస్కారం' అందుకున్న ప్రముఖులు


పురస్కారాన్ని అందుకుంటున్న దృశ్యం

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1986-87 బ్యాచ్‌కు చెందిన పాఠశాల పూర్వ విద్యార్థులు శనివారం మధ్యాహ్నం 'స్టూడెంట్స్ మోటివేషన్' కార్యక్రమం నిర్వహనంతరం పలువురు ప్రముఖులకు 'శ్రీకారం విశిష్ట సేవా పురస్కారం' అవార్డులను ప్రదానం చేశారు. సమాజ సేవ, వైద్య వృత్తిలో విశిష్ట సేవలందించిన దృష్ట్యా అవార్డులను ప్రదానం చేసినట్టు వివరించారు. 'శ్రీకారం విశిష్ట సేవా పురస్కారం' అవార్డులను పొందిన వారిలో హైకోర్టు జడ్జీ లక్ష్మీ నారాయణ, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు నునుగొండ అంజయ్య ఉన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, 1986-87 బ్యాచ్‌కు చెందిన పాఠశాల పూర్వ విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.గంగారాం, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వంట పాత్రల బిల్లు సాధించుకున్న కార్మికులకు శుభాకాంక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పోరాడి వంట పాత్రల బిల్లులు సాధించుకున్న కార్మికులకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ.. గత సంవత్సర కాలంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు నూతన వంట పాత్రలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయినాక ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, వంట పాత్రలు ఇవ్వాలని పోరాటం చేస్తున్న సందర్భంలో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం నిన్న 23 కోట్ల 76 లక్షల 30 వేలు రాష్ట్రవ్యాప్తంగా వంట పాత్రల కొనుగోలు విడుదల చేస్తూ జీవో ఇచ్చిందని తెలిపారు. దాంట్లో భాగంగా నిజామాబాద్ జిల్లాకు కోటి 39 లక్షల 5000 రూపాయలు వచ్చిందని తెలపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చక్రపాణి, నాయకులు హనుమాన్లు పాల్గొన్నారు.

వరి పంటల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు

నవతెలంగాణ-ఎడపల్లి

వరి పంటల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు అన్నారు. మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామ శివారులోని వరి పంటలను శనివారం ఆయన సందర్శించారు. తెగుళ్ల నివారణకు ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖవిస్తీర్ణ అధికారి జ్యోతి, రైతులు తాటి సంతోష్ గౌడ్, తాజా మాజీ ఉపసర్పంచ్ కుంట శ్రీనివాస్, చేపూర్ కర్జాకర్ గౌడ్, జక్కలి ప్రవీణ్, కుమ్మరి సందుల రవి, దెగ్లూర్ సుమన్, సాయిలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ వరద కాలువ మొరం ఉచితంగా తరలించుకోవచ్చు

నవతెలంగాణ-బాల్కొండ

ఎస్సారెస్పీ వరద కాలువ నుండి మొరం కావాల్సిన రైతులు, నూతన ఇంటి నిర్మాణ దారులు ఉచితంగా మొరం తరలించుకోవాలని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి శనివారం తెలిపారు. ఎస్సారెస్పీ వరదకాలువ నుంచి మొరం కావాల్సిన రైతులు తమ పట్టాపాస్ బుక్ జిరాక్స్‌ను సంబంధిత ఎమ్మార్వోకి ఒక లెటర్ రాసి ఇచ్చి తర్వాత ప్రాజెక్ట్ ఈఈకి మీ పట్టాపాస్ బుక్ జిరాక్స్ ఇచ్చి ఉచితంగా మీమీ పంట పొలాలకు మొరాన్ని తరలించుకోవాలని అన్నారు. అలాగే నూతనంగా ఇండ్లు నిర్మించుకునే వారు వారి గ్రామపంచాయతీ పర్మిషన్ లెటర్‌ను ప్రాజెక్ట్ ఈఈకి ఇచ్చి ఇంటి నిర్మాణం కొరకు ఉచితంగా మొరాన్ని తరలించుకోవాలని సూచించారు. బ్రోకర్లకు తావివ్వకుండా రైతులు, నూతన గృహ నిర్మాణదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

28, 29న ఏఐటీయూసీ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 28, 29న ఏఐటీయూసీ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఈనెల 28, 29 తేదీలలో ఏఐటీయూసీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు వ్యవసాయ మార్కెట్ యార్డులోని మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ తరగతుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు, కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 రకాల చట్టాలు, నూతనంగా తీసుకొచ్చిన నాలుగు కోడ్లపై అవగాహన, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు సమస్యలు స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు తదితర అంశాలపైన ఏఐటీయూసీ అనుబంధ సంఘాల కార్యకర్తలు నాయకులకు అవగాహన కల్పించి రాబోయే కాలంలో పోరాటాలకు సన్నద్ధం చేయటం కోసం ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు టి.చక్రపాణి, కార్యదర్శి పి.హనుమాన్లు, బి.అనిల్, సంపత్, భాగ్యలక్ష్మి, కవిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
ఆదివారం | సెప్టెంబర్ 22, 2024 | www.navatelangana.com

నేడు మెగా ఆరోగ్య శిబిరం



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని శ్రీ వాసవి ప్రైవేట్ స్కూల్ ఆవరణంలో నేడు(ఆదివారం) నిర్వహించే ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం పరుచుకోవాలని మద్నూర్ మండల కేంద్రంలో శనివారం ఉదయం మెగా ఆరోగ్య శిబిరం గురించి దండోరా వేయించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న వైద్య శిబిరానికి బోధన్, మహారాష్ట్ర నుంచి ప్రముఖ ఆస్పత్రి వైద్యులు రానున్నారని, కావున మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి శిబిరాన్ని విజయవంతం చేయాలని బిజెపి నాయకులు తెలిపారు.

క్రీడా పరికరాల కిట్లు వితరణ

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడనికి అదే గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ఈరవోయిన సంగమేశ్వరు తన సొంత డబ్బులతో నాలుగు వేల రూపాయల విలువ గల క్రీడా పరికరాలు వాలీబాల్, నెట్ డొనేషన్ చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి రెడ్డి తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి క్రీడ పరికరాల కిట్లు డొనేషన్ చేసిన సంగమేశ్వరకు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



కిట్లు అందజేస్తున్న ఈరవోయిన సంగమేశ్వరు

అంగన్‌వాడీల్లో అవస్థలు

- టీచర్లు, అయాలు లేక ఇబ్బందులు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

బాన్సువాడ గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలలో పోషకాహార లోపాన్ని అధిగమించాలనే సంకల్పంతో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అంగన్ వాడి పూర్వ పాఠశాలగా పునర్ధరణ చేసింది. అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారాన్ని ఇవ్వడం పాటు విద్యను నేర్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు సైతం మెనూ ప్రకారం భోజనంతోపాటు గుడ్డు, పాలు, బాలామృతం, చిరుతిండికి సంబంధించిన ఆహారాన్ని ప్రభుత్వమే సమకూర్చుతోంది. ఇవన్నీ బాగానే ఉన్నప్పటికీ పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలను ఇప్పటికీ భర్తీ చేయకపోవడంతో బాన్సువాడ డివిజన్ పరిధిలోని వలు కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేక పోవడంతో చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

బాన్సువాడ డివిజన్ పరిధిలో ఒక ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 222 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. బాన్సువాడ ప్రాజెక్టు పరిధిలో 13 వేల 7 వందల పిల్లలు ఉండగా, గర్భిణీ స్త్రీలు 14 వందల 52 మంది , బాలింతలు 1183 మంది మహిళలు ఉన్నారు. ఇందులో ఆరు ఏండ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం ఇవ్వడంతోపాటు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. బాన్సువాడ ఐసీడీఎస్ ప్రాజెక్ట పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కలిపి 222 మంది పని చేయాల్సి ఉంది. కానీ వివిధ కారణాలతో ఖాళీ అయిన పోస్టులను ఇప్పటికీ భర్తీ చేయకపోవడంతో కేంద్రాల ద్వారా సేవలు అందించడంలో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. 71 మంది ఆయాలు, 19 మంది అంగన్‌వాడీ కార్యకర్తలను బాన్సువాడ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో భర్తీ చేయాల్సి ఉంది. దీనికి తోడు వయోపరిమితి పూర్తి చేసుకున్న కార్యకర్తలు, ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందితే ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.





ప్రకటన జారీ.. నిలిచిన భర్తీ ప్రక్రియ

గతంలో పోస్టుల భర్తీకి ప్రకటన జారీ చేసి దరఖాస్తులు స్వీకరించి తరవాత ప్రక్రియను నిలిపివేశారు. కొత్త నిబంధనలు జారీ చేసి మరోసారి భర్తీకి ప్రకటన జారీ చేస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేలు, అవగాహన కార్యక్రమాలు జరిగినప్పుడు చిన్నారులను పర్యవేక్షించాల్సిన ఆయాలు లేనిచోట కేంద్రాలు మూతపడుతున్నాయి. ఈ సమయంలో చిన్నారులకు ఆహారాన్ని అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే కార్యకర్తలు లేని పాఠశాలల్లో పిల్లలకు అక్షరాలు దిద్దించడం కష్టతరమవుతుంది. ఇద్దరి విధులు ఒక్కరే నిర్వర్తించడంతో అనుకున్న మేర లక్ష్యం నెరవేరడం లేదని స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాన్సువాడ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్ వాడి కేంద్రాల్లో ప్రత్యామ్నాయంగా పక్క కేంద్రం టీచర్ ను అయాకు ఏర్పాటు చేశామని, ప్రభుత్వ పరంగా అందవాల్సిన అన్ని సౌకర్యాలు పిల్లలకు, గర్భిణి స్త్రీలకు, బాలింతలకు అందుతున్నాయని ప్రాజెక్టు అధికారిణి సౌభాగ్య తెలిపారు.

ఆదేశాలు రాగానే భర్తీ చేస్తాం
బావయ్య, కామారెడ్డి జిల్లా సంక్షేమాధికారి

కేంద్రాల్లో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే. బాన్సువాడ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 90 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అందులో 72 మంది ఆయాలు, 19 మంది అంగన్‌వాడీ టీచర్లను నియమించాల్సి ఉంది. గతంలో వెలువడ్డ ప్రకటన ప్రక్రియను ప్రభుత్వమే నిలిపివేసింది. కొత్త నిబంధనలు, విద్యార్హతలు, చిన్నారుల పర్యవేక్షణపై నైపుణ్యం ఉన్న వారిని ఎంపిక చేయాలని ఆలోచిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే భర్తీ చేస్తాం.

పెండింగ్ డీఏ విడుదల చేయాలి

- టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి : సిహెచ్ అనిల్‌కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

ఉద్యోగులకు ప్రభుత్వం బకాయిపడిన 4 డిఎలు వెంటనే విడుదల చేయాలని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు గత ప్రభుత్వంలోనే మూడు డిఏలు పెండింగ్‌లో ఉండగా ఈ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మరో రెండు డిఏలు బకాయి పడిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు పూర్తి అయినా నేటికీ డి.ఏలు ప్రకటించకపోవడం, గత ప్రభుత్వం వేసిన పి ఆర్సీ కమిటీ రిపోర్ట్ వెంటనే తెప్పించుకునే ఆలోచన చేయకపోవడం, శుక్రవారం నిర్వహించిన మంత్రి వర్గంలో ఉద్యోగులకు కనీసం రెండు డి ఏ ప్రకటిస్తుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశే కలిగించిందన్నారు. ఉద్యోగులకు న్యాయం చేస్తామని తెలిపిన పాలకులు సాగతీత వైఖరితో వ్యవహరించకుండా వెంటనే బాకాయి పడిన డిఏలను, పిఆర్సీ అమలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై సత్యనారాయణ .సిహెచ్ అనిల్ కుమార్. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణ గర్వించే గొప్ప నేత..

- కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



నివాళు అర్పిస్తున్న మార్కండేయ యూత్ సభ్యులు

నవతెలంగాణ-బిచ్కుంద

1969 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో తొలి దశ ఉద్యమాలకు ఊపిరి పోసిన మహా వ్యక్తి తెలంగాణ గర్వించే గొప్ప నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని అధ్యక్షులు గంగుల శ్రీనివాస్ అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా బిచ్కుంద మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అధ్యక్షులు గంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మశాలి ముద్దుబిడ్డ తెలంగాణ పోరాట యోధుడు తెలంగాణనే తన ప్రాణంగా మంత్రి పదవులు సైతం వదిలి తన కొన ఊపిరి వరకు మూడు దశాబ్దాల పాటు తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహా వ్యక్తి అని ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన చూపిన మంచి మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ రాజు, సంఘం సభ్యులు గంగాధర్, బాలరాజ్, రాజు, లక్ష్మన్ పరమేష్, హన్మాండ్లు, సాయికృష్ణ, బాలకిషన్, సురేష్, సాయిలు, డాక్టర్ నర్సింలు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడికి సన్మానం



సన్మానం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-పిట్లం

జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కంచర్ల బాలకిషన్ కు ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో శనివారం శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు గంగా ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా నియమితులై మొట్టమొదటిసారిగా పిట్లం విచ్చేయడం అభినందనీయమని అన్నారు. ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరిస్తూ వారిని అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షులు బొడ్ల రాజు , ఉప్పు విట్టల్, బెజుగం చంద్రశేఖర్, బెజుగం రవీందర్, మండలి వేణు, ఆర్.ప్రసాద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని ఆజామాబాద్, వెంకటాపూర్ గ్రామాలలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రతి ఇంటికి కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని, ఎటువంటి సమస్యలు ఉన్న పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,బీసీ సెల్ అధ్యక్షులు భాస్కర్, సంజీవ్‌రెడ్డి, గ్రామస్తులు పోచయ్య, మహేందర్,అంజయ్య, సాయిలు, శివ, జీవన్ సంతోష్, లక్ష్మణ్, పండరి, బాగయ్య, స్నేహిత్, లచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలను సమర్పించండి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం డిఎల్‌పిఓ అధ్యక్షతన సమీక్ష నిర్వహించినట్టు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా డి ఎల్ పి ఓ నాగరాజ్ మాట్లాడుతూ.. గ్రామంలో పబ్లిష్ చేసిన ఓటర్ జాబితా నందు ఎవరైనా అభ్యంతరం తెలిపితే వారి నుండి లిఖితపూర్వకంగా అప్లికేషన్ తీసుకొని అట్టి అప్లికేషన్ ను ఎంపీడీవో ద్వారా జిల్లా పంచాయతీ అధికారికి పంపితే అభ్యంతరాలు ఉన్న వారి ఓటర్ జాబితా మాడిఫై చేసి మళ్ళీ పంపుతారని ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామంలో అభ్యంతరాలు ఉన్న ఓటర్ జాబితా అప్లికేషన్లను త్వరగా తీసుకోవాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అనిత, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలి

- ఎంపీడీవో రాజేశ్వర్



పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని నేరల్ గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బ తాండ(బామన్ సింగ్ తాండా) లో ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ సెంటర్లను గాంధారి మండల ఎంపిడిఓ రాజేశ్వర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని ఆయన సూచించారు. పరిశుభ్రతపై విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులుప్రతిభ రాణి, వాసవి అంగన్‌వాడీ టీచర్ లత తదితరులు పాల్గొన్నారు.

వరికి కాండం తొలుచు పురుగులు

- నివారణా సూచనలు పాటించాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

మహమ్మద్ నగర్ మండలంలోని ముగ్దంపూర్ క్లస్టర్ గాలిపూర్ గ్రామంలో వరి పొలాలను శనివారం మండల వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరి పంటలో కాండం తలుచు పురుగు, పొట్ట కుళ్ళు తెగులు, బ్యాక్టీరియా ఎండాకు తెగుళ్ళు ఉధృతంగా వ్యాప్తి చెందడం గమనించినట్టు. ఈ చీడలు, తెగుళ్లను అరికట్టడానికి రైతులకు పలు సూచనలు చేసినట్టు తెలిపారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 400 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ ఎకరానికి 60 మి.లీ. పిచికారి చేయాలని, పొట్ట కుళ్ళు తెగులు నివారణకు ప్రొపికొనజోల్ ఎకరానికి 200 గ్రాములు పిచికారి చేయాలని, బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ మందును ఎకరానికి 50 గ్రాములు పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

వ్యక్తి గత శుభ్రత ముఖ్యం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని వజ్జపల్లి గ్రామంలో శనివారం గ్రామ ప్రజలకు వ్యక్తి గత శుభ్రత అవగాహన కల్పించినట్లు సూపర్‌వైజర్ సుగుణ గ్రామ ప్రజలకు వివరించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి రోజు ఆశ కార్యకర్తలు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. చిన్న పిల్లలకు రోగ నిరోధక ఇంజక్షన్‌లు ఇచ్చినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్‌యం బిగ్య శ్రీ ఆశ కార్యకర్తలు సంధ్య, పద్మ, అంగన్ వాడీ టీచర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాలను పరిరక్షిస్తాం

- నాగన్నగారి మెట్ల బావి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-లింగంపేట్

చారిత్రక కట్టడమైన నాగన్న గారి మెట్ల బాయిని ప్రారంభించడం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రావు అన్నారు. చారిత్రక కట్టడాలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిరక్షిస్తుందని తెలిపారు. శుక్రవారం రాత్రి లింగంపేట్ మండలం కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న నాగన్న గారి మెట్ల బాయిని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు జిల్లా కలెక్టర్ ఆసీస్ సంగ్వన్ ఎస్పీ సింధు శర్మ రేన్ వాటర్ ప్రాజెక్టు ప్రతినిధి కల్పన రమేష్ పూజలు చేసి ప్రారంభించారు. నాగన్న గారి బావి అభివృద్ధికి సహకరించాలని రైన్ వాటర్ ప్రాజెక్టు ప్రతినిధి కల్పన రమేష్ తమ దృష్టికి తీసుకురావడంతో పది లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశామన్నారు. ప్రాచీన కట్టడాలకు పూర్వం తీసుకురావడానికి పరంపర ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందించారు. నాగిరెడ్డిపేట మండలం తాండూర్ గ్రామంలోని త్రిలింగేశ్వర శివాలయం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని అందుకు రైన్ వాటర్ ప్రాజెక్టు ప్రతినిధి ముందుకు రావాలన్నారు.

నాగన్న గారి బావి అభివృద్ధికి గత కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేసిన కృషిని ఆయన అభినందించారు. ఆయన శ్రమ నేడు ఫలించిందని దీనిని స్థానికులు చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలన్నారు. నాగన్న గారి భావి చరిత్రను పర్యటకేంద్రకంగా మార్చడానికి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన త్వరలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని చారిత్రక కట్టడాలను సందర్శించనున్నారు. బావి తరాలకు చరిత్రలో నిలిచిపోయే రోజు అని ప్రాచీన కట్టడాల పూర్వైభవం తీసుకొచ్చినందుకు అన్ని శాఖల అధికారులను అభినందించారు. నాగన్న గారి మెట్ల బాయి చరిత్రను సామాజిక మధ్యమాల ద్వారా ట్విట్టర్ ఫేస్బుక్ తో పాటు యువత ప్రచారం చేయాలన్నారు.

లింగంపేట్ దత్తత తీసుకుంటా : జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగవాన్

లింగంపేట మండల కేంద్రాన్ని దత్తత తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం రాత్రి మెట్ల బాయి ప్రారంభోత్సవ వేడుకలు సందర్భంగా ఆయన మాట్లాడారు. చరిత్రకు చెదలు పట్టకుండా భావితరాతకులకు గుర్తుండేలా చారిత్రక కట్టడాలు పూర్వవైభవం తీసుకురావడం ఇందులో ప్రధాన పాత్ర పోషించినటువంటి ఇన్ఫోసిస్ సంస్థ రైన్ వాటర్ ప్రాజెక్ట్ ప్రతినిధులను ఆయన అభినందించారు. వారి రెండు సంవత్సరాల శ్రమ నేడు భావితరాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ జిల్లా విద్యాధికారి రాజు డిఆర్‌డిపి జిల్లా అధికారి సురేందర్ ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాస్ జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి ఎమ్మార్వో నరేందర్ ఎంపీడీవో నరేష్ ఐకెపి ఎపిఎం శ్రీనివాస్. మండల కాంగ్రెస్ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ ఆయా శాఖలకు చెందిన అధికారులు ప్రజా

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో సంకర బుచ్చయ్య మృతి చెందడంతో బాధిత కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటుందని తెలిసి గ్రామానికి చెందిన వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి రూ 3000, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు భూపతి శ్రీనివాస్, అబ్దుల్ మహమ్మద్, నేరెళ్ల నాగరాజు, నోముల సందీప్, బిట్ల అవినాష్, కడెం శ్రీకాంత్, దొంతుల నవీన్, గిరి గారు రాజు, బి పేట సంతోష్, కోటూరు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీలో డీపీవో పర్యటన



పరిశీలిస్తున్న డిపిఓ

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండల కేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు సదాశివ నగర్ గ్రామపంచాయతీని సందర్శించి స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా సానిటేషన్ కార్యక్రమాలను ట్యాంక్‌ల క్లీనింగ్ కార్యక్రమాలను పరిశీలించి కంపోస్ట్ షెడ్ ను సందర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోషకుమార్ ఎం.పి. ఓ సురేందర్ రెడ్డి ఏపీఎం రాజిరెడ్డి పంచాయతీ కార్యదర్శి మాధవి లత గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

రిటైర్డ్ ఎంఈఓ పాత శైలయ్య మృతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసి సాధారణ ఉపాధ్యాయుని నుండి మండల విద్యా అధికారిగా పనిచేసిన అనుభవజ్ఞుడు పాత శైలయ్య శనివారం నాడు ఉదయం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఉపాధ్యాయునిగా, ప్రధాన ఉపాధ్యాయులుగా, ఎంఈఓగా అంచలంచలుగా ఎదిగి సుదీర్ఘ కాలం పాటు ఎల్లారెడ్డి మండలంలో విద్యా బోధన చేసి ఎంతోమందిని ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేశాడని, మరెంతో మందిని ఉత్తములుగా తీర్చిదిద్దిన గురువని ఆయన సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. వయసు రీత్యా ఇటీవల కాలంగా అనారోగ్యంతో మృతి చెందారు.

గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-రామారెడ్డి

గత పది రోజుల నుండి మండలంలోని గొల్లపల్లి, కన్నాపూర్ గ్రామాలకు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులతో పాటు విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మాజీ సర్పంచులు పాల లావణ్య మల్లేష్, రాజ నర్సులు మాజీ ఎమ్మెల్యే సురేందర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించాలని సూచించడంతో పాటు, సర్పంచులు వినతి పత్రం అందజేశారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్యాలయాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవుని పల్లి లో శనివారం మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్ రెడ్డి హెచ్‌డీఎఫ్‌ఐ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ ఆలీ షబ్బీర్ ఆదేశాను సారం కామారెడ్డిలో దేవునిపలిలో ప్రజల సౌకర్యార్థం భగత్ సింగ్ విగ్రహం పక్కన నూతన బ్రాంచ్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు చాట్ల వంశీకృష్ణ, పాత శివ కృష్ణమూర్తి, ఆకుల రూప రవి తదితరులు పాల్గొన్నారు.

మర్కల్‌లో స్వచ్ఛసేవ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ గ్రామంలో శనివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగిన స్వచ్ఛ సేవ కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు నిర్వహించిన ర్యాలీ లో యాభై మంది విద్యార్థులు పాల్గొని స్వచ్ఛత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. శ్రావణి, ఉదయిని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చంద్రకళ.బి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- ఏడు తులాల బంగారం నగదు చోరీ




పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-గాంధారి

తాళం వేసిన ఇంట్లో చొరబడి మొత్తం 7 తులాల బంగారం, నగదు ఎత్తుకుపోయిన ఘటన గాంధారి మండల కేంద్రంలో కమ్మరిగల్లీలో శనివారం వెలుగుజూసింది. కుమ్మరి రంజిత్ అనే వ్యక్తి తన కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి గురువారం సాయంత్రం వేములవాడ దర్శనానికి వెళ్లి తిరిగి వచ్చి చూసే సరికి బీరువ పగలగొట్టి బీరువాలో గల బంగారు వంకు, బంగారు గుండ్లు, బంగారు నక్లెస్, దాదాపు మొత్తం 7 తులాలు మరియు నగదు పోయినది. కుమ్మరి రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్లూస్ టీంతో ఆధారాలు సేకరించినట్టు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని సదాశివనగర్ సిఐ సంతోష్ కుమార్ పరిశీలించారు. ఎవరైనా ఇంటికి తాళాలు వేసి వెళ్లినచో గాంధారి పోలీసులకు సమాచారం ఇవ్వలని సూచించారు.

వాహనాల తనిఖీ చేపట్టిన ఎక్సైజ్



తనిఖీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై శనివారం ఎక్సైజ్ శాఖ అధికారులు వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావు మాట్లాడుతూ ఎలాంటి మత్తు పదార్థాలు, ఇతర రాష్ట్రాల నుండి మద్యం రవాణా జరగకుండా తనిఖీలు చేయనున్నట్టు తెలిపారు తెలిపారు. ఈ తనిఖీలలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సుదర్శన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ బాలరాజు, కానిస్టేబుల్ జాకబ్, స్వాతి, తదితరులు ఉన్నారు.

ఆపదలో ఉన్న వ్యక్తికి ఆర్థికసాయం



అర్థికసాయం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆపదలో ఉన్న ఓ కుటుంబానికి ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి ముదిరాజ్ తన వంతుగా రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. ఇందల్‌వాయి మండలంలోని గౌరరం గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన సాకలి రాము గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం రామును పరామర్శించి, వారి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్స్

నవతెలంగాణ-బోధన్

అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్‌లను బోధన్ రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. సాలుర మండలంలోని మందర్న శివారులో గల మంజీర నది నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ మచ్చేందర్ తెలిపారు. ఇసుక రవాణాకు అనుమతులు లేకపోవడంతో పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

జిల్లా సెషన్స్ కోర్టు పిపిగా రాజరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కోర్టు ఇంచార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది, పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాదస్తు రాజారెడ్డిని నియమిస్తు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా ఉత్తర్వులు జారీచేశారు. పోక్సో కోర్టు స్పెషల్ పి.పిగా ఉన్న ఆయన జిల్లా సెషన్స్ కోర్టులో పోలీసుల తరపున క్రిమినల్ కేసులను ప్రాసిక్యూషన్ నిర్వహిస్తారు. రాజారెడ్డి గతంలో జిల్లా సెషన్స్ కోర్టు పబ్లిక్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మూడేళ్లపాటు విధులు నిర్వహించారు. మాదస్తు నియామకం పట్ల తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్, న్యాయవాదులు హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు.

మానవత్వం చాటుకున్న కటారి రాములు

- పోగొట్టుకున్న డబ్బులు బాధితులకు అందజేత



నవతెలంగాణ-కంఠేశ్వర్

సీఐటీయూ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కటారి రాములు మానవత్వం చాటుకున్నారు. హాస్పిటల్లో కట్టాల్సిన డబ్బులను పోగొట్టుకున్న బాధితులకు ఆ డబ్బులను శనివారం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఇందూరు క్యాన్సర్ హాస్పిటల్లో పేషెంట్ లక్ష్మికి సంబంధించిన డబ్బులు మార్గమధ్యంలో పోగొట్టుకుంది. ఆ డబ్బులు సిఐటియు అనుబంధ సంఘం ఆటో యూనియన్ అధ్యక్షులు కటారి రాములుకు దొరకడంతో పోగొట్టుకున్న డబ్బులతో పాటు పేషెంట్ లక్ష్మికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఉండడంతో.. వాటి ఆధారంగా వారు పోగొట్టుకున్న డబ్బులను కటారి రాములు బాధితులకు అందజేశారు. స్వార్థంతో కూడిన ప్రస్తుత సమాజంలో దొరికిన డబ్బులను తిరిగి బాధితులకు అందజేసిన కటారి రాములును పలువురు అభినందిస్తున్నారు.

రైలు కింద దూకి యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన వినోద్ కుమార్ (28) శుక్రవారం రాత్రి రైలు కింద దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, రైల్వే పోలీసుల సమాచారం మేరకు అభంగపట్నంకు చెందిన అల్లే వినోద్ కుమార్ కొన్ని రోజుల క్రితం గల్ఫ్ నుండి తిరిగి వచ్చి మరొక గల్ఫ్ దేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేసే క్రమంలో మెడికల్ ఫిట్ నెస్‌లో ఫెయిల్ కావడంతో పాటు అప్పులు పెరగడంతో మనస్తాపానికి గురై శుక్రవారం అర్ధరాత్రి నవీపేట్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు పంచనామా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామని రైల్వే ఎస్సై సాయి రెడ్డి తెలిపారు.

ద్విచక్రవాహనం మీద పడి సొసైటీ డైరెక్టర్ మృతి

నవతెలంగాణ-బాల్కొండ

ద్విచక్రవాహనం మీద పడటంతో సొసైటీ డైరెక్టర్ మృతిచెందాడు. బాల్కొండ ఎస్ఐ బి.నరేష్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నాగపూర్ గ్రామానికి చెందిన గురికాడి లింబాద్రి (50) అనే వ్యక్తి బాల్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నాగపూర్ నుంచి సొసైటీ డైరెక్టర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. శుక్రవారం బాల్కొండ శివారులోని ఫామ్‌హౌస్‌లో సహ డైరెక్టర్లతో కలిసి విందు చేసుకున్నారు. అనంతరం మద్యం మత్తులో ఆయన మొదట బైక్‌పై పడ్డాడు. ఈ క్రమంలో అదే బైక్ ప్రమాదవశాత్తు అతని ముఖంపై పడటంతో ఆయన ముక్కు, కనతపై బలమైన గాయాలవడంతో లింబాద్రి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య గురికాడి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు సూచనలు పాటించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి రైతు తమ పంట పొలాల్లో ఏదైన రోగం కనబడితే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారిని సూద మాధురి అన్నారు. శనివారం మండలంలోని యానంపల్లి గ్రామంలోని పలువురు రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సుద మాధురి మాట్లాడుతూ.. సుడి దోమ పైరు సుడులు సుడులుగా ఎండిపోతూ ఉంటుందని, దీనినే హపర్ బర్న్ అని అంటారన్నారు. ఉధృతి ఎక్కువ అయితే పొలం ఎండి పోయి పడిపోతుందని పేర్కొన్నారు. దీని నివారణకు పలు మందులను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నృపేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన

నవతెలంగాణ-నవీపేట్

వరి పంటలో వస్తున్న చీడపీడలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. మండలంలోని నాగేపూర్ రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ వరిపై వస్తున్న వ్యాధులు తిండి తెగులు, సుడిదోమ, కంకి నల్లి, పాము పొడ తేగులు, వరి అగ్గి తెగుల గురించి రైతులకు అవగాహన కల్పించి సస్య రక్షణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ ఎంఏ అలీమ్ అహ్మద్, ఏఈఓ వినోద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన మక్కలు



నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలో కురిసిన వర్షానికి రైతులు రోడ్లపై ఆరబెట్టిన మక్కలు తడిసిపోయాయి. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. గత కొన్ని రోజుల నుంచి రైతులు మక్కలు ఆరబెడుతున్నారు. చేతికి అందిన పంట ఈ వర్షం వల్ల తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

పలు గ్రామాల్లో పోషణ్ అభియాన్



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పహాడ్, కుర్నపల్లి గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎడపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు గర్భిణులకు సూచనలు అందజేశారు. గర్భిణులకు సీమంత కార్యక్రమాలను నిర్వహించారు. కుర్నాపల్లిలో అంగన్వాడి ఉపాధ్యాయులు కల్పన, గంగలక్ష్మి, సంధ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సమతుల ఆహారం అవసరం

- అంగన్వాడీ కేంద్రాలకు కావాల్సిన మౌలిక సౌకర్యాలు కల్పిస్తా
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గర్భిణులకు సమతుల ఆహారం అవసరమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి తెలిపారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ శివారులోని శ్రీలత గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో పోషణ మాసం సందర్భంగా డిచ్‌పల్లి ప్రాజెక్ట్‌లో ప్రాజెక్ట్ స్థాయి పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు కావాల్సిన మౌలిక సౌకర్యాలు కల్పించడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని, సిడిపిఓ కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.పది లక్షలు మంజూరు చేస్తానని తెలిపారు. మహిళలు జనాభాలో 55 శాతం వరకు ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని వివరించారు. ఆశాకార్యకర్తలు ఆందోళన చేసినప్పుడు వారికి తన మద్దతు ఇచ్చానని, అంగన్వాడీ, ఆశాకార్యకర్తల వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తానని తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనైనా పక్కా అంగన్వాడీ కేంద్రం ఉండే విధంగా, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతకు ముందు పలువురు మాట్లాడుతూ.. గర్భిణులకు సమతుల ఆహారం అవసరమని, తద్వారా శక్తి, రక్షణ ఉంటుందని అన్నారు. ఇదే కాకుండా పుట్టబోయే బిడ్డకు మంచి పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. గర్భిణులకు సీమంతాలు, నిర్వహించి పిల్లలకు అన్నప్రాసన, సాముహిక అక్షరాభ్యాసం చేసిన అనంతరం వారు అవగాహన కల్పించారు. గర్భిణులకు విటమిన్ లోపం వల్ల వచ్చే అనార్థాలను అర్థం చేసుకుని తక్కువ ఖర్చుతో ఆకుకూరలు తీసుకుంటూ ఉండాలని ఇదే కాకుండా నారింజ పండ్లను, ఫలాలను, పోషకాహార పదార్థాలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు, బాలింతలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని వారు అందించే ఆహారాన్ని తప్పకుండా తీసుకోవాలని గర్భిణీ స్త్రీలకు బాలింతలకు సూచించారు. పూర్తిస్థాయి విటమిన్లు గల ఆకుకూరలు, కూరగాయలు, కోడిగుడ్లు, పాలు లాంటి ఆహారాన్ని తీసుకోవాలని ప్రసవానికి అవసరమయ్యే హిమోగ్లోబిన్‌ను అభివృద్ధి పెంపొందించుకోవాలని తెలిపారు. పుట్టబోయే శిశువుకు, పుట్టిన తర్వాత బాలింతకు, బిడ్డకు తగినంత పౌష్టికాహారాన్ని అందిస్తేనే పూర్తిస్థాయి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు సూదాం లక్ష్మీ, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా సంక్షేమాధికారిని రసూల్ బి, జిల్లా ఆరోగ్య శాఖాధికారి రాజశ్రీ, సీడీపీఓ స్వర్ణ లత, డిచ్‌పల్లి మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ సంతోష్ కుమార్, అంగన్వాడీ సూపర్ వైజర్‌లు మమత, బుజ్జి, రాధా లక్ష్మీ, సరిత, సునీత, శోభ, వరలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, మోత్కూరి నవీన్‌గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్యాంసన్, వాసు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

చదువే ఆయుధం



మాట్లాడుతున్న విద్య అధికారి రవికుమార్

- ఇంటర్ విద్య అధికారి రవికుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థినులకు చదువే ఆయుధమని దాంతో దేనినైనా జయించవచ్చునని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమల పూడి రవికుమార్ అన్నారు. నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో గాను మొదటి సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థులకు స్వాగతం పలికేందుకు గాను ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ పార్టీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ అధ్యక్షత వహించగా జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలోనే మంచి ఫలితాలు సాధించే పేరున్న బాలికల జూనియర్ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి గానూ మరింత ఉత్సాహంగా చదువుతూ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల విద్యార్థులకు మంచి విద్యాబోధన చేస్తున్న అధ్యాపకుల బృందాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కళాశాలలో ఉర్దూ మీడియం, తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం, ఒకేషనల్ గ్రూపులలో సుమారు 1200 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని, ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ ఆధ్వర్యంలో కళాశాల మరింత అభ్యున్నతికి చేరుకుంటుందని ఆయన ఆకాంక్షించారు. అధ్యాపకులు, సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. కళాశాలలో అన్ని సౌకర్యాలతో కూడిన ప్రయోగశాలలను, పరికరాలను, లైబ్రరీ ప్రతి విద్యార్థిని వినియోగించుకొని మంచి పరిజ్ఞానాన్ని సంపాదించాలని ఉద్బోధించారు. ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ మాట్లాడుతూ.. ఇంటర్ విద్య విద్యార్థుల భవిష్యత్తు ఎలా ఉండాలనేది నిర్ణయిస్తుందని అందుకే ఈ కళాశాల స్థాయిలోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. ప్రతి అంశాన్ని, విషయాన్నీ క్షుణ్ణంగా అర్థం చేసుకొని తమ అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు ఎల్లవేళలా అధ్యాపకులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. విద్యార్థులకు ఉన్నతమైన చదువుతో పాటు నృత్యాలు, పాటలు, క్రీడలు అదే స్థాయిలో అవసరమని అన్నారు. జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌ల సంఘం అధ్యక్షులు, ఐలాపూర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.చిన్నయ్య, నిజామాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఖాలిక్, ఆర్మూర్ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయానందరెడ్డి, భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, నిజామాబాద్ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నరసయ్య, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

కోర్టులలో జడ్జిల నియామకం చేపట్టాలి

- హైకోర్టు న్యాయమూర్తికి వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రతినిధి బృందం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లాకోర్టు ప్రాంగణంలోని వివిధ కోర్టులలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కాసోజు సురేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు శనివారం జిల్లా జ్యూడిషియరి సమావేశంలో పాల్గొనేందుకు ప్రభుత్వ అతిథి గృహానికి వచ్చిన ఆయనకు అందజేసిన రెండు పేజీల వినతిపత్రంలో న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, కక్షిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కోశాధికారి దీపక్, సీనియర్ న్యాయవాదులు మంచికట్ల గోవర్ధన్, రాజలింగం, జి.వి కృపాకర్ రెడ్డి, కవిత రెడ్డి, పిల్లి శ్రీకాంత్, అయ్యూబ్, మానిక్ రాజు, ఆశ నారాయణ, రవి, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్‌లతో కలిసి జస్టిస్ సురేందర్‌కు జిల్లా జ్యూడిషియరికి కావలసిన ప్రగతి సూచికను వినతిపత్రంలో పేర్కొన్నారు. నూతనంగా మంజూరు అయిన నిజామాబాద్ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, నిజామాబాద్ ఐదవ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో న్యాయమూర్తులను నియమించాలని కోరారు. దీర్ఘకాలికంగా న్యాయమూర్తుల పదవులను భర్తీ చేయని ప్రత్యేక మహిళ కోర్టు, ఫోక్సో కోర్టులలో వెంటనే సంబంధిత పదవులను భర్తీ చేయాలని విన్నవించారు. జిల్లాకోర్టులో కోర్టుల సంఖ్య పెరగడం, దానికి తోడు న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులతో నిత్యం కోర్టు ప్రాంగణం టూ వీలర్, ఫోర్ వీలర్ మోటారు వాహనాలతో రద్దీగా ఉంటున్నదని తెలిపారు. ఓల్డ్ విద్యాశాఖ కార్యాలయ ఆవరణ రెండు ఎకరాల స్థలాన్ని జిల్లా జ్యూడిషియరీకి కేటాయించే విధంగా కృషి చేయాలని కోరారు. జిల్లాకోర్టులో రెండు లిఫ్టులు పని చేయడం లేదని దాని వలన పలు సమస్యలను ఎదుర్కోవడం జరుగుతున్నదని తెలియజేశారు. లిఫ్టులను త్వరితగతిన బాగుచేయించాలని కోరారు. వినతిపత్రాన్ని చదివిన జస్టిస్ కాసోజు సురేందర్ సమస్యల పరిష్కారంలో తనవంతు ప్రయత్నాలు చేసి సహకరిస్తానని తెలిపారు.

సొసైటీ సభ్యత్వం కలిగిన వారు ఈకేవైసీ చేయించుకోవాలి

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ సొసైటీ సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డుతో పాటు, పట్టా పాస్ పుస్తకాలను ఈకేవైసీ చేయించుకోవాలని సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దీన్ సంఘం సభ్యులకు కోరారు. శనివారం సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాజన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా స్వల్పకాలిక రుణాలను సంఘం సభ్యులకు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే సీజన్‌లో సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రుణమాఫీ ప్రతి రైతుకూ అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. తక్కువ రుణం ఉన్న రైతులకు షేర్ అమౌంట్ నుంచి అడ్జస్ట్‌మెంట్ చేయడం జరుగుతుందన్నారు. నూతనంగా సభ్యత్వం కోసం రైతులు ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సొసైటీ పాలకవర్గ సభ్యులు అగ్గు నారాయణ, బుడ్డోల్ల సాయిలు, చంద్రకళ, మన్నె సావిత్రి, సీతవోలు రాము, ఇంద్రసేన్, సిబ్బంది ఆర్.సాయిబాబా, ఇంతియాజ్, మురళీ కిషోర్, లోకం శ్రీనివాస్, హరీష్, ఇస్మాయిల్, రైతులు అమ్రాద్ వెంకటి, హనుమాన్లు, మూసా, పోచ మల్లు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎరాజ్‌పల్లి సార్వజనిక్ ఉత్సవ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామ సార్వజనిక్ దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా సూర అనిల్‌ను గ్రామ పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం ఆయన ఆధ్వర్యంలో దేవీనవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించినందున ఈ సంవత్సరం కుడా సూర అనిల్‌ను సార్వజనిక్ దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు గ్రామ పెద్దలు స్పష్టం చేశారు. అనంతరం అధ్యక్షులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు ఉన్నారు.

ఎన్ఆర్ఐ జీవో పెట్టడం హర్షనీయం

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ గల్ఫ్ కార్మికుల కోసం తీసుకున్న నిర్ణయం గల్ఫ్ కార్మికులకు ఊరట కల్గిస్తోందని బి.సి. ఎన్ఆర్ఐ అధ్యక్షులు బట్టు స్వామి, ఉపాధ్యక్షులు గురాయి రాజేందర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాలుగా పోరాటం చేస్తే ప్రస్తుతం ఫలితం దక్కిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో పెట్టిన విధంగా ఎన్ఆర్ఐ పాలసీ జీవో పెట్టడం వాళ్ళ గల్ఫ్ కార్మికులకు ఊరట కల్గించిందని తెలిపారు. ఎన్ఆర్ఐ పాలసీ జీవో పెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెలే పైడి రాకేష్‌రెడ్డి, ప్రవాస భారతీయుల హక్కుల వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహానాయుడులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- అంగన్వాడీ సూపర్వైజర్ వెంకట రమణమ్మ



అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అర్బన్ అంగన్‌వాడీ సూపర్వైజర్ వెంకట రమణమ్మ తెలిపారు. శనివారం పట్టణంలోని సైదాబాద్-2 అంగన్వాడీ సెంటర్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, 7 నెలల నుంచి మూడు సంవత్సరాల తల్లులు తగు జాగ్రత్తలతో పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. సాముహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సవిత, ఆయా మమత, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్ర గ్రామపంచాయతీ లో ముమ్మరంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను నిర్వహించినట్లు పంచాయతీ సెక్రెటరీ యాదగిరి శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని వాటర్ ట్యాంక్ క్లోరినేషన్ , పారిశుద్ధ్య నిర్వహణ పనులను చేపట్టామన్నారు. ముకుంద రెడ్డి , కుమ్మరి గల్లి , బస్టాండ్ , పశువుల బజార్ లలో గల వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేసి ఆయా గల్లీలలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వాటర్ సిబ్బంది , పారిశుద్ధ్య కార్మికులు , సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని వెంటనే అందించండి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన గజ్జల లింగం గత సంవత్సర క్రితం తన వ్యవసాయ క్షేత్రం వద్ద విద్యుత్ షాక్ తో మృతి చెందగా, మృతికి సంబంధించిన విద్యుత్ నష్టపరిహారం ఇప్పటివరకు అందకపోవడంతో, స్థానిక నాయకులు బండి రవి దృష్టికి తీసుకెళ్లడంతో, ఆయన మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి తో కలిసి వరంగల్లోని వరంగల్లోని విద్యుత్ ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. వెంటనే పరిహారం అందించాలని కోరినట్లు తెలిపారు. అధికారులు స్పందించి రికార్డులను పరిశీలించి త్వరలోనే బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండి రవి, రఘోత్తమ రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ సలాహా కమిటీలో సభ్యునిగా మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ సంఘం రాష్ట్ర సలహా కమిటీ మెంబర్ గా మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిదర్ రెడ్డిని నియమిస్తూ కమిషన్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల తెలంగాణ విద్యార్థి ఉద్యమ రాష్ట్ర నాయకుడు గడ్డం సంపత్ హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిదర్ రెడ్డి రాజకీయ, ప్రజా సేవలో సంపూర్ణమైన అవగాహన సేవ గుణం కలిగిన నాయకుడన్నారు. అటువంటి నాయకున్ని గుర్తించి కమీషన్ లో చోటు కల్పించడం పట్ల కమీషన్ చైర్మన్ రంగారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యం లోపించొద్దు

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీఓ మలహరి గ్రామపంచాయతీ కార్యదర్శి సూచించారు. శనివారం లింగంపేట మండలంలోని ఎక్కపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అంగన్వాడి తనిఖీ చేశారు పారిశుద్ధ పనులను పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా పారి సిద్ధం లోపించకుండా మురికి కాలువల్లో చెత్త చేదారము నిల్వ ఉండకుండా వెంటనే తొలగించాలని అన్నారు. ఆయన వెంట కార్యదర్శి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

టీఎన్జీవో సభ్యత నమోదు

నవతెలంగాణ-లింగంపేట్

టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా సంఘం పిలుపుమేరకు టీఎన్జీవోస్ ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శనివారం లింగంపేట్‌లో ప్రారంభించారు. లింగంపేట్ మండలంలో తహసిల్దార్ కార్యాలయం, జూనియర్ కాలేజీ కార్యాలయంలో ఉద్యోగుల ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమం టీఎన్జీవోస్ యెల్లారెడ్డి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రతి ఒక్కరు ప్రాథమిక సభ్యత్వం తీసుకోవాలని వారు సూచించారు ప్రతి ఒక్కరు సంఘములో చేరి సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో యల్ మహిపాల్ అధ్యక్షులు, వి శరన్ కార్యదర్శి, రాజగౌడ్, శ్రీకాంత్ ఎమ్మార్వో నరేందర్ , మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

పుట్టబోయే బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష

నవతెలంగాణ-ఎడపల్లి

పుట్టబోయే బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని ఎడపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారిని సాయిస్థఫీర్దోషి అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలోని హేమమాలిని అంగన్వాడి కేంద్రంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన బోధన్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, మాజీ మంత్రి ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శనివారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదారాబాద్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన సందర్భంలో ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం సెప్టెంబర్ 22, 2024 www.navatelangana.com

నాగాపూర్‌లో స్వచ్ఛతా హిసేవ కార్యక్రమం పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగాపూర్‌లో శనివారం స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాలలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలను గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో చింతరాజ శ్రీనివాస్ పరిశీలించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో మినీ వాటర్ ట్యాంక్ల వద్ద చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అన్ని వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ వేసి క్లోరినేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను, నీటి నిల్వ గుంతలను పరిశీలించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాడైన వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పాడైన వస్తువులలో ఎక్కువ రోజుల నుండి మీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఇంటింటికి మరుగు దొడ్డి నిర్మించుకొని వాడుకోవాలన్నారు. గ్రామంలోని పలు కాలనీలలో రోడ్డు వెంట పెరిగిన పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది చేత తొలగింపజేశారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, కారోబార్ రవి, వాటర్ మెన్, సఫాయి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రిమి కీటకాలను తొలిదశలోనే గుర్తించాలి

మండల వ్యవసాయ అధికారి లావణ్య

నవతెలంగాణ-బాల్కొండ

పంటలలో క్రిమి కీటకాలను, తెగుళ్లను తొలిదశలోనే గుర్తించాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య రైతులకు సూచించారు. ఏవో లావణ్య ఏఈఓ రేష్మతో కలిసి బాల్కొండ శివారులోని వరి పంట క్షేత్రాలను శనివారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల వాతావరణంలో పెరిగిన తేమ కారణంగా మండల పరిధిలోని వివిధ పంటలలో తెగుళ్ళు, కీటకాల ఉధృతిలో పెరుగుదలను గమనిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల వల్ల వారిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు, అగ్గి తెగులు, సుడిదోమ ఉధృతి ఎక్కువగా అయినట్లు తెలిపారు. వరిలో ఆకు ఎండు తెగులును గమనించిన వెంటనే వాటి వ్యాప్తిని అరికట్టాలని అన్నారు. క్రిమి కీటకాలను, తెగుళ్లను వాటి తొలిదశలోనే గుర్తించడం వల్ల పటిష్టమైన నివారణ చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని ఏవో రైతులకు సూచించారు.

త్యాగధనుడు.. కొండ లక్ష్మణ్ బాపూజీ

- కమ్మర్‌పల్లిలో ఘనంగా బాపూజీ వర్ధంతి
- జయంతిని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించడం పట్ల హర్షం

నవతెలంగాణ-విలేకరుల బృందం

కమ్మర్‌పల్లి : పదవులను కూడా తృణప్రాయంగా వదులుకున్న త్యాగధనుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని మండల పద్మశాలి సంఘం సభ్యులు పేర్కొన్నారు.శనివారం మండల కేంద్రంలో మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలితరం ఉద్యమకారులు, రాజీలేని తెలంగాణ పోరాట యోధుడు, మూడు తరాల ఉద్యమ నాయకుడు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పద్మశాలి ముద్దుబిడ్డ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హాసకొత్తూర్ చౌరస్తా వద్ద ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి మండలంలోని అన్ని గ్రామాల పద్మశాలి బంధువులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల పద్మశాలి సంఘం సభ్యులు మాట్లాడుతూ తొలి మలిదశ తెలంగాణ సాధన పోరాటంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. 1969లో తన మంత్రి పదవిని కూడా వదులుకున్న త్యాగధనుడని కొనియాడారు. నిజాం వ్యతిరేక పోరులో ఒకవైపు పాల్గొంటూనే, మరోవైపు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వందేమాతరం, క్విట్ ఇండియా ఉద్యమాల్లోనూ కొండా లక్ష్మణ్ బాపూజీ భాగస్వామి అయ్యారన్నారు. ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవ చేయడంతో పాటు నిరంతరం బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తపించారని పేర్కొన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 27న జరిగే ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా జరుపుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల పద్మశాలి కుల బంధువులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు చింత తిరుపతి, ప్రధాన కార్యదర్శి నల్ల భూమేశ్వర్, కోశాధికారి పోతు ధరణి కుమార్, కమ్మర్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు పిల్లమరి సుధాకర్, ఉప్లూర్ ఓం మార్కండేయ శాఖ అధ్యక్షులు పోతు మురళి, ఓం మొదటి పద్మశాలి శాఖ అధ్యక్షులు జిందం హరికుమార్, నాగపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు అంబల్ల అరవింద్, కోన సముందర్ గ్రామ శాఖ అధ్యక్షులు కిషన్, హాసకొత్తూర్ ప్రధాన కార్యదర్శి కుందారపు మురళిధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చింత హనుమంతు, పద్మశాలి సంఘం సీనియర్ సభ్యులు నారాయణ దాస్, పోతు లింగమూర్తి, నాయకులు, పద్మశాలి సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


ధర్పల్లి : బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంఠేశ్వర్ : కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఓబీసీ నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాజనరేంద్ర గౌడ్, ఓబీసీ నగర అధ్యక్షులు బాసోల్ల నాగరాజు, సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, అర్బన్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ బొబ్బిలి రామకృష్ణ, సంపత్, రాజు, వెంకటేష్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

నిఖార్సయిన తెలంగాణ వాది కొండ లక్ష్మణ్ బాపూజీ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎలగందుల మురళి అన్నారు. నగరంలోని అమరవీరుల పార్క్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మెతుకు శివకుమార్, జిల్లా అధికార ప్రతినిధి ఆమంద్ ప్రవీణ్ కుమార్, జిల్లా నాయకులు కుర్లెం శివ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందని బాల్కొండ నియోజకవర్గ పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు నర్సయ్య తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బ్రహ్మ దండి చిన్నయ్య, జిల్లా కార్యదర్శి గురుడు దయానంద్, దాసరి నర్సింగ్ దాస్, మాజీ ఎంపీటీసీ పెంటు గంగాధర్, జోగు నరేందర్, బిజ్జి సుదర్శన్, జోగు అనిల్ కుమార్, జక్కుల జీవన్, షేర్ల సత్మారామ్, గుండారం రమేష్, నర్సయ్య శ్రీనివాస్, సిరిమల్లె రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు..

ధర్పల్లి : మండలం కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పాము నారాయణ, అంకం ఆనంద్, దువ్వ భూమేష్, విష్ణుం దాస్, పురుషోత్తం, నారాయణ, గుండుక శంకర్, శ్రీనివాస్, స్వామి, నవీన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ : ఉద్యమాలనే ఊపిరిగా, సమాజ వికాసమే ప్రగతికి చిహ్నంగా దేశసేవకు అంకితమై స్వాతంత్ర్య పోరాటంతో పాటు నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలో, తెలంగాణ సాధన కోసం రాజీలేని పోరాటాన్ని నడుపుతూ తెలంగాణ ప్రజల చైతన్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా కొండా లక్ష్మణ్ బాపూజీ నిలిచారని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ఉపాధ్యాయులతో కలిసి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన జెట్టి సాయిబాబు (48) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ బి.నరేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం 2021 సంవత్సరంలో జెట్టి సాయిబాబు తన కూతురికి పెళ్లి చేయడంతో కొంత అప్పు అయింది. దీంతో మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. శుక్రవారం ఉదయం మద్యం తాగి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవపడి వారిని ఇంటి నుండి వెళ్లగొట్టి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కొడుకు జెట్టి సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని సోంపూర్ గ్రామంలో శనివారం గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీస్ సిబ్బంది కలిసి పట్టుకొని, తదుపరి చర్యలకు పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు తహసీల్దార్ జె. మల్లయ్య తెలిపారు.

మెగా లోక్ అదాలత్‌పై అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

మెగా లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారాల గురించి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనర్సయ్య క్లుప్తంగా వివరించారు. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మి నర్సయ్య, నిజామాబాద్ / కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు. నూతనంగా అమలులోకి వచ్చిన చట్టాల గురించి బాధితులకు, సాక్షులకు సాక్ష్యం ఇచ్చుటలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. 28.09.2024 రోజున మెగా లోక్ అదాలత్ ద్వారా రోడ్డు ప్రమాదాల కేసులు, వేరే వివిధ కేసులు పరిష్కరించడానికి అవలంభించవలసిన నిబంధనల గురించి క్లుప్తంగా వివరించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజగోపాల్ గౌడ్, రాజారెడ్డి, బంటు వసంత్, కె. శేషు, శ్యాంరావు, నిమ్మ దామోదర్ రెడ్డి, ఖాందేష్ శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి. రామకృష్ణ, యం.డి. రహీముద్దీన్, భూసారపు రాజేష్ గౌడ్, చిదిరాల రాణి తదితరులు పాల్గొన్నారు.

కరెంటు తీగలతో పొంచి ఉన్న ప్రమాదం

నవతెలంగాణ-రెంజల్


ప్రమాదకరంగా మారిన వైర్లు

మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల రోడ్డుపై కరెంటు తీగలు కిందికి వేలాడుతూ ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానిక ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోధన్ బస్సు ఈ రోడ్డు గుండానే బస్టాండ్‌లోకి రావాల్సి ఉంటుందని, ఇతర ట్రాక్టర్లు తరచూ వస్తూ ఉంటాయని కరెంటు తీగలు కిందికి వేలాడుతూ ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి ఈ కరెంటు తీగలను పైకి ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు కల్పించాలని ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. సిపిఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ కార్యాలయం కుమార్ నారాయణ భవన్‌లో శనివారం కామ్రేడ్ పిట్ల రమ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు సత్య హాజరై మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం మహిళలపై అత్యాచారం చేసిన దోషులకు అండగా నిలబడుతుందని, జైలు శిక్షలను కూడా తగ్గిస్తుందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి పుష్ప, డివిజన్ నాయకులు పద్మ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్మెంట్‌లో వికలాంగుల కోటా 5శాతం పెంచాలి

- ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-బోధన్


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

స్కిల్ డెవలప్మెంట్‌లో వికలాంగులకు అదనపు వాటా 5శాతం పెంచాలని ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ పాలసీ 2024లో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు షేక్ నజీర్, ఏశాల గంగాధర్, సాయిలు, పల్లికొండ చింటూ, దేవదాస్ ,బీరుగొండ, షాదుల్లా, నేహాల్, సింగాడి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలతో పాటు ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలి

జేవీవీ జిల్లా అధ్యక్షులు కోయడి నర్సింలు


రాజ్యాంగ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

శాస్త్రీయ ఆలోచనలతో పాటు ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థులు అలవరచుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కోయేడి నర్సింహులు అన్నారు. మండల కేంద్రంలోని నవోదయ జూనియర్ కళాశాలలో జేవీవీ నాయకులు రాజశేఖర్ అధ్యక్షతన శాస్త్రీయ దృక్పథం- రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోయేడి నర్సింలు మాట్లాడుతూ విద్యార్థులకు జీవితం, మంచి ఆలోచనలతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. శాస్త్రీయత, సమానత్వం, ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. రాజ్యాంగం పట్ల అవగాహనతో చైతన్యం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జెవివి ఆధ్వర్యంలో ప్రచురించిన రాజ్యాంగ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేవివి నాయకులు నాయక్‌వాడి శ్రీనివాస్, కిషన్, లక్ష్మన్ రాజ్, ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి, రఘురాం, అంబర్ సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

యూనివర్సిటీకి శాశ్వత వైస్ ఛాన్స్‌లర్‌ను నియమించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-డిచ్‌పల్లి


మాట్లాడుతున్న నాయకులు

తెలంగాణ యూనివర్సిటీకి శాశ్వత వైస్ ఛాన్స్‌లర్‌ను నియమించాలని, ఈనెల 27న జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో న్యూ బాయ్స్ హాస్టల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ యూనివర్సిటీ అధ్యక్షులు శివ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్న ఇప్పటికి యూనివర్సిటీలకు శాశ్వత వైస్ ఛాన్సలర్‌ను నియమించకపోవడంలో ఆంతర్యం ఏమిటోనని ప్రశ్నించారు. అదే విధంగా సెర్చ్ కమిటీ జాప్యాన్ని వీడానాడి తక్షణమే రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌ను నియమించి కుంటి పడి ఉన్న యూనివర్సిటీని బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దినేష్, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు రాజు, అశోక్, తరుణ్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో పర్యావరణ విధ్వంసం

- టీయూలో తెలుగు సాహిత్యం పర్యావరణ దృక్కోణం సదస్సులో పలువురు వక్తలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అభివృద్ధి పేరుతో పర్యావరణ విధ్వంసం చేస్తున్నారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీలో శనివారం సాహిత్య అకాడమీ, తెలుగు అధ్యయన శాఖ తెలంగాణ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సి. హెచ్.ఆరతి అధ్యక్షతన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి ముఖ్య అతిథిగా 'తెలుగు సాహిత్యం - పర్యావరణ దృక్కోణం అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరికత పేరుతో, అనాగరికతకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఆధునికత పేరుతో ప్రపంచ దేశాలన్నీ పర్యావరణ కాలుష్యాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి గుర్తించినట్లు పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. తెలుగు శాఖ వారు పర్యావరణం పట్ల సదస్సు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. హెచ్.ఆరతి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో పర్యావరణ స్పృహ వచ్చినట్లయితే సామాజిక మార్పు తప్పకుండా జరుగుతుందని, పరిశోధక విద్యార్థులకు కొత్త అంశంపట్ల ఆసక్తి పెరుగుతుందని అన్నారు. తెలుగు అధ్యయన శాఖ ప్రొఫెసర్ కరిమిండ్ల లావణ్య మాట్లాడుతూ సామాజిక పర్యావరణ స్పృహ కలిగించడం ప్రధాన ఉద్దేశ్యమని ఈ సమావేశం వల్ల సాహిత్యాభివృద్ధితో పాటు పర్యావరణంలో మార్పు జరుగుతుందని అన్నారు. సాహిత్య అకాడమీ కన్వీనర్ ప్రొఫెసర్ సి.మృణాళిని మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యంలోనూ పర్యావరణ ప్రస్తావన ఉందని తెలిపారు. కీలకోపన్యాసకులు ఎస్.వి. సత్య నారాయణ, తెలుగు అధ్యయన శాఖ విభాగాధిపతి ప్రొఫెసర్ లక్ష్మణచక్రవర్తి తదితరులు మాట్లాడారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పి.జి.విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న వక్త

కామ్రేడ్ షేక్ బాబు సేవలు మరువలేనివి

నవతెలంగాణ-బోధన్

కామ్రేడ్ షేక్ బాబు ప్రజా ఉద్యమాల్లో చేసిన సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర నాయకులు భూమయ్య అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని పిఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించిన కామ్రేడ్ షేక్ బాబు మొదటి వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. షేక్ బాబు కమ్యూనిస్టు పార్టీలో పనిచేసిన కుటుంబంలో వీరులపాడులో పుట్టి బోధన్ పట్టణానికి చదువు కొరకు వచ్చి ఇక్కడ స్థిరపడ్డారని అన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. ఉద్యమాల పట్ల నిక్కచ్చిగా వ్యవహరిస్తూ ఈ ప్రాంతంలో జరిగిన ఉద్యమాల్లో తన వంతు పాత్ర నిర్వహిస్తూ సిపిఐ పార్టీ నాయకుడిగా ఎదిగి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. హైదరాబాదు నగరంలో సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభ, తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ జరుగుతున్నాయని అన్నారు. అమరుల స్ఫూర్తితో మనం ప్రజా ఉద్యమాలకు అంకితం అవుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఎం జిల్లా నాయకులు ఏశాల గంగాధర్, నాగల హనుమంతరావు, రాధాకృష్ణన్, న్యాయవాది సిపిఐ కమలాపురం రాజన్న, సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్, పార్టీ జిల్లా నాయకులు, ఎం.సాయిలు, ఎండి.గౌస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అంజలి, వికలాంగుల సంఘం జిల్లా కార్యదర్శి రాములు, సలీం, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూమయ్య

విద్యాసంస్థల అభివృద్ధిని వేగవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


నిజామాబాద్ పట్టణంలో విద్యాసంస్థల అభివృద్ధిని వేగవంతం చేయాలని టీజీవిపి ఆధ్వర్యంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తాకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్, నగర అధ్యక్షుడు అఖిల్, నాయకులు మనోజ్, సుజిత్, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

- మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న భవానీ
- వరి పంటలు పరిశీలన

నవతెలంగాణ-నందిపేట్

రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న భవానీ తెలిపారు. శనివారం మండలంలోని వెల్మల్ గ్రామంలో వరి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. ఆగస్టులో అధిక వర్షాలు కురవడంతో ఈ నెలలో చీడపీడలు, తెగుళ్ల ఆశిస్తున్నాయని తెలిపారు. తద్వారా రైతులు వీటిని గమనిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఎక్కువగా దుబ్బు చేసే దశ నుంచి చిరుపొట్ట దశలో అధికంగా ఆశిస్తుందని, పూతదశలో ఉధృతి అధికమైతే దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. ఆకుల కొనలనుండి అంచుల వెంబడి ఎండిపోవడం ప్రధాన లక్షణమని.. ఈ తెగులు గమనించిన వెంటనే నత్రజని ఎరువును తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. తొలిదశ అంటే దుబ్బు చేసే దశలో కాపర్ హైడ్రా-కిక్లోరైడ్ 2 గ్రాములు ప్లాంటామైసిన్ 0.4గా మిశ్రమాన్ని ఒక లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలన్నారు. వరి పంట పూత దశలో ఉన్నప్పుడు, కంకి బయట పడ్డప్పుడు కాపర్ శిలీంద్రనాశినులను పిచికారీ చేయకుండా ప్లాంటమైసిన 0.4 గ్రా.. లేదా ఆగ్రిమైసిన్ 0.4గ్రా.. లీటరు నీటికి పిచికారీ చేయాలని సూచించారు. వరిపైరులో సుడిదోమ గమనిస్తే పొలంలో నీరు తీసి ఎండబెట్టడం లాంటి పద్ధతులు పాటించాలి. పైమెట్రోజెన్ 0.6 గ్రా, 0.47 మి.లీ. లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రా లీటర్ల నీటిలో కలిపి మొక్క మొదళ్లుతడిచే విధంగా పిచికారీ చేయాలని తెలిపారు. వరిలో కంకినల్లి గమనిస్తే దీని నివారణకు స్పైరోమెసిఫెన్ 1.0 మిలి లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పికిచారీ చేయాలని సూచించారు.


వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి